www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 7 జనవరి 2023

5

తూర్పుగోదావరి



రాష్ట్రంలో రాక్షస పాలన : గోరంట్ల

ప్రజాశక్తి - కడియం

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రస్తుతం రాక్షస పాలన సాగుతుందని రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. మండలంలోని మురమండలో టిడిపి నాయకులు ప్రత్తిపాటి రామారావుచౌదరి ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ గోరంట్ల, ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ పాల్గొన్నారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి పత్రాలను అందచేసి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సైకో పోవాలి సైకిల్ రావాలి అని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు పన్నులు, నిత్యావసర సరుకుల ధరలతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

జిఒ1ను రద్దు చేయాలి

వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

శ్యామల సెంటర్‌లో జిఒ ప్రతులు దహనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజా ఉద్యమాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధ చర్యలు ఆపాలని, రోడ్లపై ప్రదర్శనలు సభలు నిషేధిస్తూ ఇచ్చిన జిఒ 1ను వెంటనే రద్దు చేయాలని వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన, ధర్నా, జిఒ కాపీల దహనం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, సిపిఐఎంఎల్ నగర కార్యదర్శి కె.జోజి, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ మాట్లాడారు. రాజకీయ పార్టీలు, సంఘాలు, సాధారణ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడిందన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీ సభలు, సమావేశాలు మినహా మిగిలిన ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు నిర్వహించుకునే సభలు, ర్యాలీలకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందన్నారు. సభలు, ర్యాలీలను నిషేధిస్తూ పోలీసులకు సర్వహక్కులు కల్పిస్తూ జిఒను విడుదల చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. ఈ ఏడాది ప్రజలకు నూతన సంవత్సర కానుక అన్నట్లుగా జారీ చేసిన జిఒ నెంబర్ 1 అత్యంత అప్రజాస్వామికమైనన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఇతరులకు ఇబ్బంది లేకుండా తనకు నచ్చిన రీతిలో..నచ్చిన విధంగా జీవించడం, తనకున్న అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వెల్లడిరచడమే కాకుండా తనకు రాజ్యాంగం కల్పించిన హక్కు కోసం పిడికిలి బిగించి నినదించే హక్కు రాజ్యాంగం ద్వారా వచ్చిందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కును ఏ రూపంలో కాలరాసేలా ప్రయత్నించినా అది ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీయడమేనన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 దేశ ప్రజలందరికీ వాక్ స్వాతంత్రం, భావ ప్రకటన స్వేచ్ఛలతోపాటు శాంతియుతంగా సమావేశమయ్యే హక్కును కూడా కల్పించిందన్నారు.



నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

ముఖ్యమంత్రి పర్యటనల సమయంలో ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతలు, కార్యకర్తలను సైతం గృహ నిర్బంధానికి గురిచేస్తున్నా రన్నారు. చివరికి ి ప్రజా సంఘాలకు సంబంధించిన మహాసభలకు సైతం కార్యకర్తలను వెల్లనీయకుండా ఇళ్లకే పరిమితం అయ్యేలా పోలీసులతో బెదిరింపులకు పాల్పడటం దారుణమన్నారు. తొలుత శ్యామల సెంటర్‌లో అఖిల పక్షం నాయకులు చేరుకొని కోటిపల్లి బస్టాండ్ మీదుగా శ్యామల సెంటర్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జిఒ ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.పవన్, బి.రాజులోవ, ఎస్ఎస్.మూర్తి, రామకృష్ణ, కృష్ణ, పూర్ణిమరాజు, సావిత్రి, పి.వెంకటేశ్వరావు, సిపిఐ నాయకులు వి.కొండలరావు, ఎస్.రమణ, సిపిఐఎంఎల్ నాయకులు వెంకటనాయడు, ఎవి.రమణ, పిడిఎస్‌యు జిల్లా నాయకులు కె.భాను ప్రసాద్, ఐ.చంద్రశేఖర్, దినేష్, పట్టణ కార్యదర్శి ధర్మేష్ బాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ

గ్రూప్-1 పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 8న నిర్వహించబోయే గ్రూపు-1 ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని డిఆర్ఓ జి.నరసింహులు అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రూప్ - 1 పరీక్షల నిర్వహణపై ఎపిపిఎస్‌సి కమిషన్ అధికారులు, లైజనింగ్ అధికారులు, ఛీఫ్ సూపరింటెండెంట్లు, తదితరులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడారు. జిల్లాలో 342 పరీక్షా కేంద్రాల ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షలకు 7,946 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపరు-1 తిరిగి మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు పేపరు-2 పరీక్ష నిర్వహిస్తామన్నారు.ఉదయం జరిగే పరీక్షకు ఉ. 9.45లోపు, మధ్యాహ్నం జరిగే పరీక్షకు మ. 1.45 లోపు అభ్యర్థులు కచ్చితంగా పరీక్షా కేంద్రానికి హాజరు కావాలన్నారు. అదే విధంగా పరీక్షా సమయం పూర్తయ్యేవరకు అభ్యర్థులను బయటికి వెళ్లేందుకు అనుమతించరాదన్నారు. పరీక్షా కేంద్రానికి వచ్చే ముందు హాల్ టిక్కెట్లతోపాటు ప్రభుత్వం గుర్తించిన ఏదైనా ఒక ఒరిజినల్ ఫొటో గుర్తింపుకార్డు వెంట తీసుకురావాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఏలాంటి మొబైల్ గానీ, బ్లూటూత్, స్మార్ట్ వాచ్, క్యాలిక్ లేటర్ ఇతర ఎలక్ట్రానికి వస్తువులు అనుమతించబోరని ఆయన స్పష్టం చేశారు. వీటిని గుర్తించేందుకు పరీక్షా కేంద్రం వెలుపలే స్క్రీనింగ్ చేసేందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ప్రశ్నాపత్రాలకు సంబంధించి సీల్ చేసిన కవరును అభ్యర్థుల ముందే ఓపెన్ చేయాలన్నారు. ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్లు, ఇతర పరీక్షా సామగ్రి జిల్లాకు చేరిననాటి నుంచి పోలీసు బంధోబస్తుతో భద్రపరచాలని అదే విధంగా పరీక్షల అనంతరం సంబంధిత సమాధాన పత్రాలను పూర్తి బంధోబస్తుతో ట్రెజరీకి చేర్చాలన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి సర్వీస్ కమిషన్ సూచించిన మార్గదర్శకాలను లైజన్ అధికారులు, ఛీఫ్ సూపరింటెండెంట్లు ఒకటికి రెండు సార్లు పూర్తి పరిశీలన చేయాలన్నారు. మాస్ కాపింగ్ కు తావులేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లతో పరీక్షలు సజావుగా ప్రశాంత వాతావరణంలో నడిపించాల్సిన బాధ్యత మనపై ఉందని సర్వీసు కమీషన్ అసిస్టెంట్ సెక్రటరీ కె.శారద పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు నియమించిన లైజనింగ్ అధికారులు పరీక్షా సమయం అంతా ఆయా పరీక్షలు రాసే గదులను పర్యవేక్షించాలన్నారు. సంబంధిత పరీక్షా కేంద్రాలను ముందుగానే సంబంధిత లైజన్ అధికారులు పరిశీలించి అక్కడ ఏర్పాట్లను చూడటంతో పాటు ఛీఫ్ సూపరింటెండెంట్లు ఇన్విజిలేటర్లు తో ముందుగా సమావేశం నిర్వహించుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణీలు, అంధులు, వికలాంగులకు పరీక్షా కేంద్రంలోని భవనం కింది అంతస్తులోనే పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షా కేంద్రం సమీపంలో జిరాక్స్, ఆన లైన్ కేంద్రాలను మూసివేసేలా చర్యలు తీసుకుంటామని ఎఎస్‌పి జివి.రావు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి డి.రామవర్మ, ఎంహెచ్ఒ డాక్టర్ ఎ.వినూత్న, ఆర్‌టిసి అసిస్టెంట్ మేనేజర్ ఎం.అజయ్‌బాబు, రాజమహేంద్రవరం రూరల్ తహశీల్దార్ ఎన్ఎస్.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

దుర్గంధం నుంచి కాపాడాలని ధర్నా

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం గ్రామంలోని ఎస్‌సి శ్మశాన వాటిక వద్ద డంపింగ్ యార్డ్ వద్ద దుర్గంధం నుంచి కాపాడాలని కెవిపిఎస్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యదర్శి ఎస్.సుదీప్తికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భగా కెవిపిఎస్ నాయకుడు రాయుడు సువర్ణరాజు మాట్లాడారు. తాటిపర్రు వెళ్లే రోడ్‌లో, శ్మశానం పక్కన గ్రామంలోని చెత్తను డంపింగ్ చేస్తున్నారన్నారు. తరచూ ఈ చెత్తకు నిప్పు పెట్టడం వల్ల వచ్చే వాయువులు, పొగ, దుర్గంధంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలు శ్వాసకోశ సంబంధిత వ్యాధుల భారిన పడే ప్రమాదం ఉందన్నారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తూరుగోపు వెంకటేశ్వరరావు, కౌలు రైతుల సంఘం నాయకులు మాగాపు తాతారావు, కటికితల నాగేశ్వరరావు, దర్శనపు వసంతరావు, కాకిలేటి చంద్రరావు, చిన్నం శ్రీను, గుమ్మడి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నాయకులు, దళితులు

సిహెచ్‌సిలో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం సిహెచ్‌సిలో విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ డిఎస్‌పి ముత్యాలరాజు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. ఆసుపత్రిలో సిబ్బంది పనితీరు, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రికార్డులు, స్టాక్ రూమ్‌లు, రక్త పరీక్షల రికార్డులను పరిశలించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న తనిఖీల్లో భాగంగా వీటిని చేపట్టామన్నారు. ఆసుపత్రిలో పారిశుధ్యం మెరుగుపడాల్సి ఉందన్నారు. జనరేటర్ సరిగ్గా పనిచేయడం లేదని, వైద్యులు విధులకు సకాలంలో హాజరుకావట్లేదని గుర్తించామన్నారు. ఈ తనిఖీల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కొవ్వూరు జయలక్ష్మి, అసిస్టెంట్ జియాలజిస్ట్ ఎస్.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



వైద్యులను ఆరా తీస్తున్న విజిలెన్స్ అధికారులు

స్ఫూర్తినీయుడు బ్రెయిలీ

ప్రజాశక్తి - తాళ్లపూడి

లూయిస్ బ్రెయిలీ స్ఫూర్తినీయుడు అని రాగోలపల్లి ఎంపిపి పాఠశాల హెచ్ఎం దున్నా దుర్గారావు అన్నారు. బ్రెయిలీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. బ్రెయిలీని స్ఫూర్తిగా తీసుకుని అంధులకు విద్యార్థి లోకం అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

100 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని అన్నదేవరపేటలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొత్తపల్లి ట్రస్ట్ సహకారంతో నిర్వహించిన వైద్యశిబిరంలో 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్ రామ్మూర్తి మాట్లాడారు. దూర ప్రాంతాలకెళ్లి కంటి వైద్య పరీక్షలు అందుకోలేని వారికి ఉచితంగా వైద్య పరీక్షలు అందించడంలో లయన్స్ క్లబ్ నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ శిబిరంలో 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని తెలిపారు. నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణ ఆసుపత్రికి వైద్యులు వైద్య సాయం అందించారు.

పలుచోట్ల అన్నదానాలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

వైకుంఠ ఏకాదశి ఉత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పలుచోట్ల అన్నదానాలు నిర్వహించారు. తాళ్లపూడిలోని మోదుగులమ్మ గుడి వీధిలో మాజీ సర్పంచ్ నామన పరమేశ్వరరావు ఆధ్వర్యంలో 3వేల మందికి, ప్రక్కిలంకలోని పాండురంగ స్వామి ఆలయంలో 2,500 మందికి, పెద్దేవంలో శ్రీ సీతారామ స్వామి ఆలయం వద్ద 4వేల మందిక అన్నదానం నిర్వహించారు.

ఈట్ స్ట్రీట్‌తో నగరానికి కొత్త శోభ

ప్రారంభోత్సవంలో ఎంపీ మార్గాని భరత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఈట్ స్ట్రీట్‌తో రాజమహేంద్రవరం నగరానికి నూతన శోభ వస్తుందని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. శుక్రవారం రాత్రి నగరంలోని ఆర్ట్స్ కళాశాలకు ఆనుకుని ఉన్న వీధిలో 'అర్బన్ ఫుడ్ ప్లాజా' పేరుతో ఈట్ స్ట్రీట్‌ను ఎంపీ భరత్, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, కమిషనర్ కె.దినేష్‌కుమార్, రుడా ఛైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ ఈట్ స్ట్రీట్‌లో వాహనాలకు ప్రవేశం లేదన్నారు. సరదాగా కుటుంబ సభ్యులతో నడచివచ్చి ఆస్వాదించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రస్తుతానికి 33 స్టాల్స్‌కు అనుమతి ఇచ్చామని తెలిపారు. మరో 30 వరకూ స్టాల్స్ వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. భవిష్యత్తులో నగరంలో పుష్కర ఘాట్, ఎకెసి కళాశాల సమీపంలో కూడా ఫుడ్‌కోర్టులను ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నామని తెలిపారు. ప్రతి రోజూ రాత్రి 7 గంటల నుంచి తొమ్మిది గంటల వరకూ ఫుడ్ కోర్టులు కొనసాగేలా నిర్ణయించామని, పబ్లిక్ డిమాండును బట్టి మరో రెండు మూడు గంటలు పెంచగలమని తెలిపారు. ఇక్కడకు వచ్చేవారికి ఎటువంటి ఇబ్బందీ కలగకుండా పోలీసు నిఘా ఉంటుందని తెలిపారు. ఆకతాయిలు, మద్యం సేవించే వారు ఇక్కడకు వస్తే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని ఎంపీ భరత్ తెలిపారు. నగర వాసులు ఈట్ స్ట్రీట్‌ను సద్వినియోగం చేసుకుని వ్యాపారులకు ప్రోత్సాహం అందివ్వాల్సిందిగా ఎంపీ భరత్ విజ్ఞప్తి చేశారు.



ఫుడ్ కోర్టులో నూడిల్స్ చేస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎంపీ భరత్

యుటిఎఫ్ గోకవరం మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -గోకవరం

యుటిఎఫ్ గోకవరం మండల కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. గోకవరం ఎంఆర్‌సి కార్యాలయంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి షరీఫ్ ఎన్నికల అధికారిగా, జిల్లా ఆడిటర్ ఎం.శ్రీనివాస్ సమక్షంలో ఈ ఎన్నిక నిర్వహించారు. గౌరవాధ్యక్షులుగా కె.నాగభూషణం, అధ్యక్షులుగా ఎస్.అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఎస్.కుమార్, ఉపాధ్యక్షులుగా పిఎస్‌విఆర్ఎల్ నరస, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాస్, కోశాధికారిగా పివివిఎస్ఆర్.త్రిమూర్తులు, ఆడిటర్‌గా ఎం.రత్నం, కార్యదర్శులు ఎన్నికయ్యారు. తనను వరుసగా ఆరోసారి ఎన్నుకున్నందుకు అనిల్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యవర్గానికి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.



దుళ్లలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంల పాల్గొన్న చందన

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - కడియం

దుళ్ల గ్రామంలోని సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వైసిపి రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. మండలంలోని దుళ్లలో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలను స్థానికులు చందన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన మాట్లాడుతూ పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ డ్రెయినేజీల పూడికతీత పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. నిధుల లభ్యతను బట్టి ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు కట్టుంగ నాగరాజు, డి.భద్రయ్య, బి.నాగేంద్ర, ఈలి గోపాలం, తాతపూడి బాబి, బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు.

స్కూలు బస్సును ఢీకొన్న లారీ

ప్రజాశక్తి - చాగల్లు

స్కూల్ బస్సును క్వారీ లారీ వెనుక నుంచి ఢీకుంది. ఈ ప్రమాదంలో స్కూల్ బస్సుల్లో ఉన్న విద్యార్థులు క్షేమంగా బయటపడ్డారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం పంగిడి నుంచి చాగల్లు వస్తున్న ఒక ప్రైవేటు స్కూల్ బస్సును, అదే రూటులో వస్తున్న క్వారీ లారీ వేగంగా వచ్చి ఢీకొంది. డ్రైవర్ మద్యం సేవించి నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతన్నారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడని స్థానికులు తెలిపారు.

టిడిపి బూత్ లెవెల్ కమిటీ సభ్యుల సమావేశం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని కాల్దారిలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు ఆదేశాల మేరకు శుక్రవారం యూనిట్, క్లస్టర్ ఇంఛార్జులు, బూత్ లెవల్ కమిటీ సభ్యుల సమావేశం టిడిపి మండల అధ్యక్షులు సింహాద్రి రామకష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రస్థాయి బూత్ పోల్ ఇంఛార్జ్ బూరుగుపల్లి అచ్యుత రామారావు కమిటి సభ్యులతో మాట్లాడి, ఓటరు లిస్టు వెరిఫికేషన్ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి సత్యనారాయణ, జడ్‌పిటిసి టిడిపి అభ్యర్థి చిట్టూరి సూర్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

గోపాలపురం : క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రయత్నిస్తే ఫలితం ఉంటుందని సంక్రాంతి సంబరాలు గ్రామ కమిటీ పెద్దలు, సీనియర్ నాయకులు పెన్నమనేని చినబాబు అన్నారు. సూచించారు. శుక్రవారం వేళ్ల చింతలగూడెం సంక్రాంతి సంబరాల్లో భాగంగా క్రికెట్ టోర్నీని ఆయన తిలకించారు. రెండో రౌండుకు 16 జట్లు అర్హత పొందాయన్నారు. ప్రవీణ్ పాండర్స్ జట్టులో అహ్మద్ ఆస్కారీ 34 పరుగులు చేసి నాలుగు వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా ఎన్నికయ్యారు. పిన్నమనేని చినబాబు, కొర్లపాటి రాజా అ అవార్డును అందించారు.

కొవ్వూరు సిహెచ్‌సిలో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

కొవ్వూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు, వైద్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఇందులో భాగంగా మౌలిక వసతులను కల్పిస్తుందన్నారు. కొవ్వూరు సిహెచ్‌సిపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టామన్నారు. వైద్య సేవలు, వైద్య పరీక్షలకు నిరాకరించినా, రాజమహేంద్రవరం ఆసుపత్రికి, ఇతర ప్రయివేటు ఆసుపత్రులకు రిఫర్ చేసినా, వైద్య పరీక్షలను ప్రయివేటు ల్యాబ్‌లకు సిఫార్సు చేసినా వెంటనే ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. అప్పుడే చర్యలు తీసుకునే వీలుంటుదన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఇకపై ప్రతిరోజూ ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉంటారని, వారి వివరాలు ప్రజలకు తెలియజేస్తామన్నారు. గైనకాలజిస్ట్, అర్థో, పిడియాట్రిస్ట్ (చిన్న పిల్లల వైద్య నిపుణులు) తదితర వైద్యుల సేవనలు కొవ్వూరు ప్రజలకు ఇకపై అందుబాటులో తీసుకొస్తామన్నారు. పోస్ట్ మార్టం గదికి, ఇతర సమస్యలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఫిర్యాదుల కోసం కొవ్వూరు ఆర్‌డిఒ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కలెక్టర్ వెంట అదనపు డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఎన్.వసుంధర, ఆసుపత్రి పర్యవేక్షకురాలు డాక్టర్ కె.సుభాషిణి, తదితరులు ఉన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ

చాగల్లు : కలవలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రధానమంత్రి టిబి ముక్తి భారత్ అభియాన్ ప్రోగ్రామ్‌లో భాగంగా క్షయ బాధితులకు పోషకాహార కిట్లను అందించామని డాక్టర్ ఎం.సౌజన్య తెలిపారు. క్షయ బాధితులను గ్రామానికి చెందిన మట్టా రాజబాబు, మట్టా గంగరాజు దత్తత తీసుకున్నారన్నారు. వారి సాయంతో పౌష్టికాహారం అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిబి ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ ఆర్.పోతురాజు, ఎంపిహెచ్ఇఒ కాటన్‌రాజు పాల్గొన్నారు.

గోకవరంలో డ్రై డే

గోకవరం : గోకవరం పద్మప్రియ థియేటర్ సమీపంలో ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర శ్రీవల్లి, వీరబాబు దంపతులు, ఎంపిటిసి సభ్యులు తోలేటి రమ్యశ్రీ, ప్రసాద్ దంపతులు పాల్గొన్నారు. శానిటేషన్ పనులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయా ప్రదేశాల్లో దోమలు నిర్మూలనకు ఆబిట్ మందు, బ్లీచింగ్ చల్లించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ వైఎస్.రాయుడు, పంచాయతీ ఇఒ టి.శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

ధవళేశ్వరం : జగనన్న పింఛన్ కానుక ద్వారా కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు వైసిపి రూరల్ కో-ఆర్డినేటర్ చందననాగేశ్వర్ శుక్రవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను పెంచారన్నారు. పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసి పింఛన్లు అందిస్తున్నామన్నారు. ఎన్ని ఆర్థిక పరమైన ఇబ్బందులున్నా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుంద న్నారు. అర్హతలుండి కార్డులు రాకుంటే దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లో వెరిఫై చేసి పెన్షన్ కార్డు జారీ చేస్తారన్నారు.

తహశీల్దార్‌ను కలిసిని ఎంపిపి శ్రీవల్లి

గోకవరం : గోకవరం మండలానికి వచ్చిన నూతన తహశీల్దార్ శ్రీనివాస్‌ని ఎంపిపి సుంకర శ్రీవల్లి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భర్త వీరబాబు, ఎంపిటిసి సభ్యులు తోలేటి రమ్యశ్రీ, ఆమె భర్త ప్రసాద్, వార్డు సభ్యులు వీర చంద్రం ఉన్నారు.

కార్టూ'నిజం'



అసలు కేసుల కంటే.. ధిక్కారణ కేసులే ఎక్కువున్నాయి.. సార్!!!

అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు

ప్రజాశక్తి -గోకవరం

మండలంలోని పరిసర ప్రాంతాల గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంక్రాంతి పేరుతో కోడిపందేలు, గుండాట, బెట్టింగులు ఇతర జూదాలను అరికట్టేందుకు సచివాలయం, పంచాయతీ కార్యదర్శులు, పోలీసులు పర్యవేక్షణ ఉండాలన్నారు. పండుగ మూడు రోజులు ఎక్కడా జూదాలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమాచారం ఎప్పటికప్పుడు తహశీల్దార్, పోలీసు కార్యాలాయాలకు ఇవ్వాలన్నారు. గతంలో జూదాలు నిర్వహించిన ప్రాంతాలను గుర్తించి సంబంధిత యజమానులకు నోటీసులు ఇవ్వాలన్నారు. యువత జూదాలవైపు మరలకుండా సంప్రదాయ క్రీడలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కెవిఎస్ఎస్ఎస్.మూర్తి ఇఒపిఆర్‌డి ఎం.రాజేశ్వరావు, వెటర్నరీ డాక్టర్ కృష్ణవేణి ఎస్ఐ ఎంవిఆర్.రెడ్డి పాల్గొన్నారు.

ఉండ్రాజవరం : సంక్రాంతిని పురస్కరించుకు అసాంఘిక కార్యకలాపాలు చేపడితే కఠిన చర్యలు తప్పవన్నారు. తహశీల్దార్ జి.కనకరాజు శుక్రవారం వెలుగు కార్యాలయంలో ఎస్ఐ కె.రామారావు అధ్యక్షతన కోడిపందేలు, జూదాల నివారణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎ.శ్రీనివాస్, ఎంఇఒ పివిఎస్.నాగరాజు, గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శి, విఆర్‌ఎలు, మహిళా పోలీసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, తాడిపర్రు సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు అన్నారు. శుక్రవారం విజయవాడలో జరిగిన సంఘం రాష్ట్ర స్థాయి విస్తత సమావేశంలో సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షునిగా చిలకలపూడి పాపారావు, ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్, కార్యదర్శిగా కె.నరేంద్రబాబు, కోశాధికారిగా వి.శ్రీదేవి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఫ్యాప్టో జిల్లా చైర్మన్‌గా రవిచక్రవర్తి

ప్రజాశక్తి - కాకినాడ

ఫ్యాప్టో జిల్లా చైర్మన్‌గా తోటకూర రవిచక్రవర్తి ఎన్నికయ్యారు. గురువారం స్థానిక యుటిఎఫ్ హోమ్‌లో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ అధ్యక్షతన ఫ్యాప్టో సమావేశం జరిగింది. ప్రసాద్ మాట్లా డుతూ ప్రభుత్వం అనుసరిస్తున్నటువంటి నిర్బంధాలను ఉద్యమాలతోనే ఎదుర్కోవాలన్నారు. ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని పెంచి, తెలుగు మీడియం ను రద్దుచేసి మిగులు పోస్టులుగా చూపించి ప్రభుత్వం మోసం చేస్తుంద న్నారు. దీనివల్ల ప్రభుత్వ విద్య కుంటుపడుతుందన్నారు. సిపిఎస్ రద్దు హామీని నేటికీ నెరవేర్చలేదన్నారు. ఈ సమస్యలపై ఫ్యాప్టో వేదికగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ టి.రవిచక్రవర్తి, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా కె.కాశీవిశ్వనాథ్, టి.వెంకటరావు, ఎన్.ఫిలిప్‌రాజు, కోశాధికారిగా బి.శరత్, సెక్రటరీగా ఎం.కూర్మారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా కెవివి.నాగేశ్వ రరావు, ఎం.శ్రీనివాస్, కెఎస్.సుబ్రహ్మణ్యం, వై.వెంకటరాజు, సిహెచ్.రవి, కొల్లి రమేష్, పివిడి.ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకరవర్మ, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.


చైర్మన్ రవిచక్రవర్తి

దవడ క్యాన్సర్‌కు అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ సీతారాంపురం మూర్తి నర్సింగ్ హోమ్‌లో దవడ క్యాన్సర్‌కు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. 50 సంవత్సరాల వయస్సు గల మహిళకు అమిలోబ్లాస్టమ్ అనే ఒకరకమైన దవడ క్యాన్సర్‌కు ఆపరేషన్ చేసి దవడతో పాటు క్యాన్సర్ కంతిని తొలగించారు. ఆ స్థానంలో టైటా నియం మెటల్ దవడను కృత్రి మంగా అమర్చి పేషెంట్‌కి ఎటువంటి ముఖ వైకల్యం లేకుండా విజయ వంతంగా శస్త్ర చికిత్స నిర్వహిం చారు. ఈ శస్త్ర చికిత్స నాలుగు గంటల పాటు జరిగింది. మూర్తి నర్సింగ్ హోమ్ వైద్యులు మాక్సిల్లో ఫేసియల్ సర్జన్ ఎ.ఎన్. మూర్తి ఈ శస్త్ర చికిత్స చేశారు. తాళ్లరేవు, అమలాపురం ప్రాంతాల్లో ఇటువంటి శస్త్ర చికిత్స తొలిసారిగా నిర్వహించినట్లు మూర్తి తెలిపారు. ఈ శస్త్ర చికిత్సకు లక్షలాది రూపాయలు ఖర్చవుతుందని, మా ఆసుపత్రిలో అత్యంత తక్కువ చార్జీలతో నిర్వహించినట్లు తెలిపారు.సర్జరీ తరువాత పేషెంట్ చాలా క్షేమంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. కాకినాడ అమత ఆసుపత్రి మత్తు వైద్యులు చిట్లా కిరణ్ కుమార్, అసిస్టెంట్ కిషన్, స్థానిక మెడికల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ పి.జగన్నాథ రావు (బాబీ), అక్షయ లాబరేటరీ రేడియోగ్రాఫర్ వెంకట్ పాల్గొన్నారు.


.కేన్సర్ శస్త్ర చికిత్స అనంతరం రోగితో వైద్యులు

వలస పక్షుల సంరక్షణపై రాష్ట్రస్థాయి వర్క్ షాప్

ప్రజాశక్తి - తాళ్ళరేవు

అంతర్జాతీయంగా భారతదేశానికి వస్తున్న వలస పక్షుల సంరక్షణకై డిప్యూటీ డైరెక్టర్ సత్య సెల్వం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ కోరంగి కాంప్లెక్స్‌లో బొంబే నేచురల్ హిస్టరీ సొసైటీ (బిఎన్‌హెచ్ఎస్) నిర్వహించారు. చిత్తడి నేలలకు ఇతర దేశాల నుంచి వస్తున్న వలస పక్షుల గణనలో భాగంగా పక్షుల వలస మార్గాలు, పక్షులు పర్యవేక్షించే పద్ధతులు, పక్షుల మరణాలు, వ్యాధి నివారణ వంటి అంశాలపై డిడి సత్య సెల్వం, సైంటిస్ట్ మహేష్ రాష్ట్రవ్యాప్త అటవీ సిబ్బందికి అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వలస పక్షుల అధ్యయనం శిక్షణ కరదీపికను సిసిఎఫ్. ఎస్.శరవణన్, జిల్లా ఫారెస్ట్ అధికారి ఐకెవి రాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఫారెస్ట్ అధికారి ఐకెవి రాజు, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎస్. శర్వానంద్, ఐ.బి.సి.ఎన్. స్టేట్ కోఆర్డినేటర్ మత్యుంజయరావు, కోరంగి రేంజ్ ఆఫీసర్ వరప్రసాదరావు, బి ఎన్‌హెచ్ఎస్ సిబ్బంది శివకుమార్, రమేష్, స్థానిక అటవీశాఖ సిబ్బంది విష్ణు అప్పారావు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

బాస్కెట్ బాల్ రాష్ట్ర స్థాయి విజేత చిత్తూరు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

రాష్ట్రస్థాయి శాప్ లీగ్ బాస్కెట్ బాల్ రాష్ట్రస్థాయి పేజ్ 2 ఛాంపియన్‌షిప్ పోటీలు కాకినాడ జిల్లా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్ర మొత్తం నుంచి 15 టీమ్ లు పురుషుల విభాగంలో, 6 టీములు మహిళా విభాగంలోని పోటీ పడగా పురుషుల విభాగంలో చిత్తూరు మొదటి స్థానం, ఏలూరు ద్వితీయ స్థానం, అనంతపురం తతీయ స్థానం సాధించగా, మహిళా విభాగంలో అనంతపురం మొదటి స్థానం, ద్వితీయ స్థానం రామచంద్రపురం, తతీయ స్థానం కాకినాడ జట్లు విజయం సాధిం చాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు విజేతలైన క్రీడాకారులను అభినందించారు.కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ జి.చక్రవర్తి, ముఖ్య క్రీడాశిక్షకులు జగన్నాథ రెడ్డి, సత్య సాయి జిల్లా ముఖ్య క్రీడాశిక్షకులు టోర్నమెంట్ కన్వీనర్ సీనియర్ బాస్కెట్బాల్ శిక్షకులు ఉదయ భాస్కర్ సిహెచ్‌వి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

వ ట్ట ణం లో ని 22వ వార్డులో డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని ప్రజలు మంత్రి వేణుకు విజ్ఞప్తిచేశారు. శుక్రవారం పట్టణం లో గడప..గడపకూ మన ప్రభుత్వం కార్య క్రమం లో ఆయన పాల్గన్నారు. ప్రభుత్వం రూపొందిచిన నవ రత్నాలు అమలు తీరును ఆయన వివరించారు. కార్య క్రమం లో పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ లు స్థానిక ప్రజా ప్రతినిధులు వార్డు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


గడప..గడపకూ.. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వేణు

రక్తహీనత నివారణపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

పిహెచ్‌సి పరిధిలో అంగర రాజమ్మ కాలనీ వద్ద శుక్రవారం రక్తహీనత నివారణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ పిఎన్ఎస్‌డి.రత్నకుమారి, డాక్టర్ జె.అనూష ప్రియాంకలు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.హీమోలిటిక్ అనీమియా, హైపర్‌వోలేమియా తదితర లక్షణాలతో రక్తహీనత ను గుర్తించవచ్చని అన్నారు. 0-19 సంవత్సరాల కిశోర బాలికలకు, తల్లిదండ్రులకు, గర్భిణులు, బాలింతలకు అనీమియా వ్యాధిపై రక్తహీనతను తగ్గించటానికి తీసుకోవలసిన జాగ్రత్తలు, పోషకాహారం తదితర అంచాల పై హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు వివరించారు. హెల్త్ సూపర్‌వైజర్ పి.సురేష్, హెల్త్ విజిటర్ మేరీ మనీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం బి. అర్జున్, వైద్య ఆరోగ్య సిబ్బంది మహిళా పోలీసులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వెలుగు, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.


రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

యానాం ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ...

ఎంఎల్ఎ గొల్లపల్లి నిరవధిక దీక్ష

- తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు...
- పలు సంఘాల నాయకులు, ప్రముఖుల సంఘీభావం

ప్రజాశక్తి - యానాం

ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శుక్రవారం ఆమరణ దీక్ష చేపట్టారు. ఉదయం స్థానిక బెజవాడ గార్డెన్స్ లోని తన కార్యాలయం నుంచి కార్యకర్తలు, అభిమానులతో కలిసి వెళ్లి స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయం వద్ద గల జెండా స్తంభం వద్ద ఆయన దీక్షకు దిగారు. ఎంఎల్ఎకు మద్దతుగా అనేకమంది కార్యకర్తలు, అభిమానులు, మహిళలు దీక్షలో పాల్గొన్నారు. పలు సంఘాల నాయకులు, పలువురు ప్రముఖులు, ఆయా సంఘాల నాయకులు శిబిరానికి వెళ్లి తమ సంఘీభావం తెలిపారు. ఈ మేరకు ఎంఎల్ఎ మాట్లాడుతూ రెండు నెలల క్రితం ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ పుదుచ్చేరి అసెంబ్లీ వద్ద ఆమరణ దీక్ష చేపట్టానని అయితే తాను నివేదించిన పలు డిమాండ్లను ముఖ్యమంత్రి రంగస్వామి నెల రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన మీదట దీక్ష విరమించానని తెలిపారు. అయితే రెండు నెలలు గడచినా ఒక్క డిమాండ్ కూడా పరిష్కరించలేదని, యానాం ప్రజల పట్ల తీవ్ర వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. నెరవేర్చగలిగే డిమాండ్లపై కూడా ముఖ్యమంత్రి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడాన్ని ఏమనుకోవాలని ప్రశ్నించారు. గత రెండేళ్లు చాలా ఓర్పుతో ఉన్నానని అయినా ప్రభుత్వం యానాం సమస్యల పట్ల చాలా ఉదాశీనంగా ఉందని అందుకే అనివార్యంగా దీక్ష చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడిం దన్నారు. తనను గెలిపించిన ప్రజలకు సమాధానం చెప్పవలసిన బాధ్యత తనపై ఉందని పేర్కొన్నారు. యానాంలో తనకు కార్యాలయం కేటాయించిక పోయినా, ప్రొటోకాల్ నిబంధనలు అమలుచేయకపోయినా మాట్లాడలేద న్నారు. ప్రజల కనీస సమస్యలు పట్టించుకోకపోతే చూస్తూ ఊరుకునే వ్యక్తిని కాదన్నారు. యానాం బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి కూడా సాయం అందించని ముఖ్యమంత్రి ప్రజా ఉత్సవాలకు లక్షలు ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు. ప్రజల సమస్యల పరిష్కారంకై నిరంతరం పోరాటం చేస్తానని ఉద్ఘాటించారు. సమస్యల పరిష్కారం కోసం ఏ త్యాగానికైనా సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తాను పదవులు కోసం కాదని ప్రజల కోసమే ఆందోళన చేపట్టానన్న విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు.నిరసన తెలిపే హక్కు తనకు ఉందని, ప్రజల సమస్యలను పరిష్కరించే బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. ఈ కార్యక్రమంలో పండు సిద్దార్థ్ కుమార్, మాగాపు సుబ్బారావు, కాటంశెట్టి రామమూర్తి తదితర నాయకులు, యువకులు, అధిక సంఖ్యలో మహిళలు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. యానాంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


సమస్యల పరిష్కారం కోరుతూ దీక్ష చేస్తున్న ఎంఎల్ఎ అశోక్

మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - పిఠాపురం

సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్ కాస్మొటిక్ చార్జీలు ఎస్ఎఫ్ఐ నాయకులు ఎంఎల్ఎ పెండెం దొరబాబుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు సిద్ధూ, శ్రీకాంత్ మాట్లాడుతూ గతంలో 2018లో ఇచ్చిన మెనూకి తగిన విధంగా మెస్ చార్జీలు ఇవ్వకపోవడం వల్ల నాణ్యత గల ఆహారం హాస్టల్ విద్యార్థులకు అందడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మెస్ కాస్మొటిక్ చార్జీలు పెంచాల న్నారు. పెండింగ్‌లో ఉన్న వాటిని తక్షణ విడుదల చేయాలని పెండింగ్ లేకుండా ప్రతినెల రాష్ట్ర ప్రభుత్వం వాటిని విడుదల చేయలన్నారు. అలాగే చదువుకుంటున్న ప్రతీ విద్యార్థికి అమ్మఒడి, విద్యాదీవెన వర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ త్వరగా పనులు పూర్తి చేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు లోవరాజు, శ్రీరామ్, చిన్ని, ప్రసన్న ఉన్నారు.


ఎంఎల్ఎ దొరబాబుతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

23,24 తేదీల్లో సిసిసిపై గోవాలో వర్క్ షాప్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

స్మార్ట్ సిటీలలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ల పనితీరుపై ఈనెల 23 24 తేదీలలో గోవాలో వర్క్ షాప్ జరగనుందని కార్పొరేషన్ కమిషనర్ కె.రమేష్ తెలిపారు. ఈ అంశంపై స్మార్ట్ సిటీ ఎస్ఇ వెంకట్రావు, సంబంధిత అధికారులతో శుక్రవారం స్మార్ట్ సిటీ కార్యాలయంలో సమీక్షించారు. స్మార్ట్ సిటీ మిషన్ డైరెక్టర్ కూనల్ కుమార్ పర్యవేక్షణలో జరుగనున్న ఈ సదస్సులో దేశంలోని 20 స్మార్ట్ సిటీలకు సంబంధించి కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరు, ఇతర అంశాలపై సమీక్షి స్తారన్నారు. గోవా వర్క్‌షాప్‌పై ఇక్కడి కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరుపై చర్చించారు.

వైసిపి పాలనలో అన్నింటా దోపిడీ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

వైసీపీ పాలనలో ఆంధ్ర రాష్ట్ర ప్రజలు అన్ని విధాలుగా దోపిడీకి గురవుతున్నారని కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ కొండబాబు విమర్శించారు. ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 32 వ డివిజనలో పర్యటించి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను స్థానిక ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రిక్కా లక్ష్మి, ఎం.డి జిలాని, నీలాపు విజయ్ కుమార్, తోట రెడ్డి, ఎం.ఏ సయ్యద్, ఎం.డీ. కరీముల్లా, పెరుమల్ల బలరాం, గొర్రెల గోపి, దారపు చిన్న, పొట్లూరి వీరబాబు, బక్కర్ పాల్గొన్నారు.

గడప గడపకూ..

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం పెద బ్రహ్మ దేవంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, పెద్దాపురం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జి దవులూరు దొరబాబు నిర్వ హించారు. ఇంటింటికి వెళ్లి నవరత్నాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివ రించి అవగాహన కల్పించారు.ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, గ్రామ సర్పంచి నీలపాల సత్య నారాయణ ఉన్నారు.

అనుమానాస్పద మృతి హత్య కేసుగా మార్పు

ప్రజాశక్తి-మండపేట

పట్టణంలో అనుమానాస్పద మృతిగా నమోదు చేసిన కేసును పోస్టుమార్టం నివేదిక ఆధారంగా హత్య కేసుగా మార్చినట్లు పట్టణ పోలీసులు శుక్రవారం రాత్రి తెలిపారు. గత నెల 31న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కొణిజాల సురేష్ హత్య గురయ్యాడు. అయితే సంఘటన స్థలంలో తగిన ఆధారాలు లభించని కారణంగా ముందుగా అనుమానాస్పద మృతిగా నమోదు చేశారు. శుక్రవారం పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసును హత్యకేసుగా మార్పు చేసి దర్యాప్తు ముమ్మరం చేసినట్లు తెలిపారు. దీనిపై రామచంద్రపురం డిఎస్‌పి, రూరల్ సిఐ పెద్దిరెడ్డి శివగణేష్, పట్టణ ఎస్ఐ ఎం.అశోక్ దర్యాప్తు చేపట్టారు. కేసు ఛేదించేందుకు రెండు బృందాలు ఏర్పాటుచేసి తగిన ఆధారాలకోసం ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. సురేష్ ముమ్మాటికి హత్యే అని అతని కుటుంబ సభ్యులు ముందుగానే విచారణ సందర్భంగా పోలీసులకు తెలిపినట్లు సమాచారం.

సంధిపూడిలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - ఆలమూరు

సంధిపూడిలో శుక్రవారం అడపా జానకిరామయ్య ఇంట్లో అగ్నిప్రమాదం సంభవి ంచింది. వంట గ్యాస్ లీకై ఈ ప్రమాదం సంభ వించి నట్లు స్థానికులు తెలిపారు. గ్రామానికి చెందిన యువకులు మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. మంటల్లో పలు విద్యుత్, గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తినష్టం సంభవించినట్లు బాధితులు తెలిపి వాపోతున్నారు.

సమతుల్య ఆహారంతో రక్తహీనత దూరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

సమతుల్య ఆహారంతో రక్తహీనతను దూరం చేయవచ్చని హెల్త్ ఎడ్యుకేటర్ సీతా మహాలక్ష్మి అన్నారు. తాళ్ళరేవులో బాలింతలు, గర్భిణులకు రక్తహీనత నివారణపై అవగాహన సదస్సు నిర్వ హించారు. ఆకుకూరలు, పప్పులు, మాంసకృతులు ఉన్న ఆహారం తీసు కుంటే రక్తం వృది ఉంటుందన్నారు.. పంచాయతీ కార్యదర్శి శంకరనారాయణ, ఏఎన్ఎం రోజా, ఆశ వర్కర్లు, యానిమేటర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు : డిఆర్ఒ

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ జిల్లాలో ఈ నెల 8వ తేదీ ఆదివారం ఏడు కేంద్రాల్లో జరగనున్న ఏపీపీఎస్సీ గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు లైజనింగ్, చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు సమన్వయంతో పని చేయా లని డీఆర్‌వో కె.శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ వివేకానంద హాల్‌లో డీఆర్‌వో కె.శ్రీధర్‌రెడ్డి ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ కె.శ్రీనివాస రావు, అడిషనల్ ఎస్‌పీ పి.శ్రీనివాసరావుతో కలిసి గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ట్రెజరీ భవంతిలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూం నుంచి ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లను సూరంపాలెంలోని ఆదిత్య విద్యా సంస్థల ప్రాంగణంలోని పరీక్షా కేంద్రాలకు చేర్చిన దగ్గరి నుంచి చివరి వరకు ప్రతి విషయంలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మొత్తం 4,782 అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. అదే విధంగా పరీక్ష కేంద్రాల వద్ద ప్రాథమిక చికిత్స అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. అభ్యర్థులు గందరగోళానికి గురికాకుండా ఉండేందుకు పరీక్ష కేంద్రం, క్లోక్‌రూం, పరీక్ష రాసేందుకు కేటాయించిన గది తదితర వివరాలు స్పష్టంగా తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పటిష్ట భద్రతకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమీపంలో నెట్ సెంటర్లు, జెరాక్సు కేంద్రాలను మూసివేయించాలని అధికారులకు సూచించారు. గర్భిణులు, వికలాంగులకు గ్రౌండ్ ఫ్లోర్లో పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పరీక్ష రెండు సెషన్లలో ఉదయం, మధ్యాహ్నం జరగనున్న నేపథ్యంలో విద్యా సంస్థల ప్రాంగణంలోనే క్యాంటిన్లలో నామమాత్రపు ధరకు మధ్యాహ్న భోజనం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డిఆర్ఒ వివరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయకుమార్, పశు సంవర్థక అధికారి డా. సూర్యప్రకాష్, సాంఘిక సంక్షేమ అధికారి జె.రంగలక్ష్మీదేవి, డీపీవో ఆర్.విక్టర్, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, మెప్మా పీడీ బి.ప్రియంవద, డీఎంహెచ్‌వో డా. ఎం.శాంతిప్రభ, చీఫ్ సూపరింటెండెంట్లు, రెవెన్యూ అధికారులు హాజరయ్యారు. గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు సంబంధించి జిల్లా పరిశీలకులుగా వచ్చిన ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ కె.శ్రీనివాసరావు పరీక్షను ప్రశాంత వాతావరణంలో సాఫీగా నిర్వహించేందుకు లైజనింగ్, చీఫ్ సూపరింటెండెంట్లకు మార్గ నిర్దేశనం చేశారు. అదే విధంగా అభ్యర్థులకు పలు సూచనలు చేశారు.

అవకతవకలపై విచారణ జరపండి

ప్రజాశక్తి - పెద్దాపురం

కట్టమూరు గ్రామపంచాయతీలో జరిగిన అవకతవకలపై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు రంగనాథం శ్రీనివాసరావు గ్రామ సభలో అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం అధ్యక్షతన జరిగిన గ్రామసభలో శ్రీనివాస్ మాట్లాడుతూ పంచాయతీ తీర్మానం లేకుండా, సర్పంచ్‌కు తెలియ చేయకుండానే ఒక పరిశ్రమ పన్నును రూ.89 వేల నుండి రూ.3,900 లకు మార్చారన్నారు. అలాగే రూ.10 వేలు ఉన్న ఇంటి పన్నును రూ.3 వేలకు మార్చారన్నారు. పన్నుల రూపంలో వసూలు చేసిన సొమ్మును సొంతానికి వాడుకుంటున్నా రన్నారు. ఈ అవకతవకలన్నింటిపై విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ప్రకటించారు. దీనిపై ఇన్‌ఛార్జ్ పంచాయతీ కార్యదర్శి పద్మరాజు మాట్లాడుతూ గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి హయాంలో జరిగిన ఈ సంఘటనలపై ఆయనను పిలిపించి వివరాలు తెలుసుకుంటానన్నారు. ఈ గ్రామ సభలో ఉప సర్పంచ్ బండారు వీరబాబు, జిల్లా అగ్రికల్చర్ కమిటీ సభ్యులు ఏలేటి అనంతలక్ష్మి, నల్లల గోవిందు, బిక్కిన సూర్యకుమారి, సిద్ధాంతపు ప్రసాద్, పెంటా విజయ్ కుమార్, డి భూషణం, సిహెచ్ వెంకన్న బాబు, మాదిరెడ్డి దత్తు,జ్యోతుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.